## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/బంట్వారం :** మండల పరిధిలో ఉన్న మంగ్రాస్‌పల్లి గ్రామంలో ఇటీవల అంజీలయ్య (32) అను వ్యక్తి గుండె పోటుతో మరణించారు. కుటుంబానికి పెద్ద దిక్కు లేకపోవడంతో స్థానిక పోలిస్టేషన్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబులు పరమేశ్వర్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ కుటుంబానికి తన వంతు సాయంగా 3 వేల రూ.లు ఆర్థిక సాయం అందించారు. ఇదిలా ఉండగా నిరుపేద పేద కుటుంబ ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సాయం చేయాలని ఆ కుటుంబం ఎదురు చూస్తోంది. బంట్వారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు సుధకర్, మరియు నజీమ్, నరేందర్,శేఖర్ ఉన్నారు.

# మహానగరి

## కందనెల్లిలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీ

**ప్రజాపక్షం/పెద్దెముల్:** మండల కేంద్రంలో కందనెల్లిలో సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించారు. గ్రామంలో వివేకానంద విగ్రహం నుంచి రోడ్లన్ని ముగ్గులతో రంగరించారు. ముఖ్య అథితిగా తాండూర్ మార్కెట్ కమిటి చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపాల్ కౌన్సిలర్ నీరజబాల్ రెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు నారాయణ్ రెడ్డి, నాయకులు మాంబపూర్ శ్రీనివస్ రెడ్డి, పాల్గోని ముగ్గుల పోటిలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి గందె శిరిష, రెండవ బహుమతి శిరిష, ముగవ బహుమతి వడ్ల శ్రీవాణిలకు బహుమతులు అందజేశారు.మాజీ సర్పంచు మోహన్ రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, రాజేందర్, కిరన్, మున్నా, మహేష్‌ఉన్నారు.

## నిషేధిత చైనా మాంజా విక్రయదారులపై 107 కేసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిషేధిత చైనా మాంజాలపై నగర టాస్క్‌ఫోర్స్ విభాగం, స్థానిక పోలీసులతో కలిసి నాలుగు నెలల్లో 107 కేసులు నమోదు చేసిందని టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి శ్రీనివాస్‌రావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సింథటిక్ నైలాన్, గ్లాస్ కోటింగ్‌తో తయారు చేసిన పతంగుల దారాలతో మనుషులతో పాటు జంతువులు, పక్షుల ప్రాణాలకు హాని జరుగుతుందని, ఈ నేపథ్యంలో చైనా మాంజాలపై నిషేధం ఉందన్నారు. అయినా కూడా కొందరు వ్యాపారులు చైనా మాంజాలను తెచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే గత అక్టోబర్ నెల నుంచి జనవరి 13వ తేదీ వరకు నగరంలోని ఏడు జోన్లలో స్థానిక పోలీసులతో కలిసి 107 కేసులు నమోదు చేసి 148ని అరెస్ట్ చేసినట్లు వివరించారు. వీరి వద్ద నుంచి రూ. 90 లక్షల విలువైన 7334 చైనా మాంజా బబ్బిన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చైనా మాంజాలను ఎవరు కూడా వాడకూడదని సూచించారు.

## లక్ష్మీనరసింహుని సన్నిధిలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామీని తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ గోదా కళ్యాణోత్సవం సందర్భంగా ఆయన పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది.

## బిజెపి బలోపేతానికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/అల్వాల్:** అల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లు అల్వాల్, వెంకటాపురం, మచ్చ బొల్లారం డివిజన్ల అధ్యక్షులు కార్తీక్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, అజయ్‌రెడ్డి నియామకమయ్యారు. మచ్చ బొల్లారం అల్వాల్ డివిజనులకు గతంలో ఉన్న వారి కాగా వెంకటాపూర్ డివిజన్ కు ఏబీవీపీలో బిజెపిలో ఆర్ఎస్ఎస్ లో క్రియాశీలకంగా పని చేసిన గోగురి శ్రీధర్ రెడ్డి నూతనంగా నియామకమయ్యారు. పార్టీ బలోపేతానికి శాయశక్తుల పని చేస్తామని వారు తెలిపారు.

## గోదాదేవి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/అల్వాల్:** టెంపుల్ అల్వాల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భోగి పండుగను పురస్కరించుకొని గోదాదేవి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆలయ వంశం పరంపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సెంచర్ ఆలయ కార్య నిర్వహణ అధికారి వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆంగ్ల సంవత్సరాది క్యాలెండర్ ను ఆవిష్కరించారు. తదనంతరం అన్నదాన వితరణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకట్ రెడ్డి, సురేందర్, సామాజిక కార్యకర్తలు వెంకటరామిరెడ్డి, శివరామకృష్ణ, రాము, రాజనర్సింహారెడ్డి, రాజు, స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరి తీసుకో.. బల్దియా

- బల్దియాకు సిఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక స్వావలంభన
- రెండు నెలల కాలంలో రూ.1,100 కోట్లు విడుదల చేసిన సర్కార్
- వచ్చే నెల మరో రూ.500 కోట్లు ఇచ్చేందుకు భరోసా
- గతంలో చిల్లిగవ్వ విదల్చని ప్రభుత్వాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఊపిరి తీసుకోలేని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) కొట్టుమిట్టాడుతోంది. ఇటీవల ప్రభుత్వం ఆర్థిక స్వాలంభన కల్పించడంతో జిహెచ్ఎంసి ఊపిరి తీసుకుంది. గత రెండు నెలలకాలంలో జిహెచ్ఎంసికి ప్రభుత్వం రూ.1,100 కోట్లు విడుదల చేసింది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న జిహెచ్ఎంసి ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,100 కోట్లతో ఊపిరి తీసుకుంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా జిహెచ్ఎంసికి ఇంత మొత్తంలో నిధులు విడుదల చేయలేదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిహెచ్ఎంసికి ఆర్థిక తొడుపాటు అందిస్తున్నారు. ప్రతినెల వేతనాలకు నిధులు సర్దుబాటు చేస్తోంది. పదేళ్ల బిఆర్ఎస్ హయంలో ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు ఎస్ఆర్‌డిపి, ఎస్ఎన్‌డిపి ప్రాజెక్టుల వ్యయాన్ని జిహెచ్ఎంసిపై మోపింది. దీంతో జిహెచ్ఎంసి ప్రాజెక్టుల నిర్మాణం కోసం బ్రాండ్‌ల సేకరణ, టార్మ్‌లోన్స్ ద్వారా బ్యాంకుల ద్వారా సుమారు రూ.6,500 కోట్ల నిధులు సేకరించింది. సేకరించిన రుణాలకు ప్రతినెల వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతినెల వాయిదాలకు రూ.180 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగుల వేతనాలకు రూ.120 కోట్లు అవసరమవుతాయి. కాంట్రాక్టర్ల బిల్లులు, సమగ్ర చెత్త నిర్వహణ ప్రాజెక్టుల కోసం మరో రూ.200 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది. జిహెచ్ఎంసి కార్యాకలాపాలు సాఫీగా సాగలాంటే ప్రతినెల కనీసం రూ.500 కోట్లు అవసరమవుతాయి. జిహెచ్ఎంసికి వచ్చే అదాయంతో పొల్చితే చెల్లించేందుకు ఏ మూలకు సరిపొని పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల ఫీజులు, ట్రెడ్ లైసెన్స్‌ల జారీ ద్వారా వచ్చే నిధులు రుణాల వాయిదాల చెల్లింపునకు, సిబ్బంది వేతనాలకు ఏ మూలకు సరిపోని పరిస్థితులు ఉన్నాయి. ప్రతినెల ఒకటవ తేదీ వచ్చిందంటే వేతనాలు చెల్లించేందుకు అధికారులు సర్దుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు దాదాపు రూ.1,300 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించాలని తరచుగా ఆందోళన బాటాపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఎటు పలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ క్రమంలో జిహెచ్ఎంసి ఆర్థిక పరిస్థితిపై కమిషనర్ ఇలంబర్తి ప్రభుత్వానికి వివరించడంతో గడచిన రెండు నెలలకాలంలో ప్రభుత్వం దశలవారిగా రూ.1,100 కోట్లను విడుదల చేసింది. వచ్చేనెల మరో రూ.500 కోట్లు విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.


### అదాయం పెంచుకునేందుకు ముమ్మరంగా కసరత్తు..

ఇక అదాయాన్ని పెద్ద మొత్తంలో పెంచుకునేందుకు జిహెచ్ఎంసి యంత్రాంగం తీవ్ర స్థాయిలో కసరత్తు మొదలు పెట్టింది. ఆస్తీపన్ను వసూలుపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. వసూలవుతున్న ఆస్తులకు చెల్లించాల్సిన పన్ను సరిగ్గా ఉందా? లేదా? అనే అంశాలను పరిశీలించేందుకు దృష్టిసారించారు. అందుకు అనుగుణంగా ఇప్పటికే ఆస్తి పన్ను పునర్ నిర్ధారణ కోసం నోటీసులు జారీ చేశారు. సంబంధిత భవనాలు, ఇళ్లకు వద్దకు ప్రస్తుతం చెల్లిస్తున్న మొత్తానికి సరిగ్గానే ఉందా? లేదా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. అలాగే ఆస్తిపన్ను జాబితాలో లేని భవనాలకు సైతం నోటీసులు జారీ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టిసారిస్తే దాదాపు రూ.3 వేల కోట్ల అదాయం సమకురుతుందని అధికారుల అంచనగా ఉంది. గత సంవత్సరం రూ.1915 కోట్లు ఆస్తిపన్ను ద్వారా జిహెచ్ఎంసికి సమకురింది. ఈ సంవత్సరం రూ.2 వేల కోట్ల పైచిలుకు రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే వాణిజ్య సముదాయాల నుంచి కూడా పెద్ద మొత్తంలో అదాయం సమకుర్చుకునే విషయంపై దృష్టిసారించారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలకు జిహెచ్ఎంసి సిబ్బంది వెళ్లి, ట్రెడ్‌లైసెన్స్‌లు పరిశీలన జరుపుతున్నారు. ట్రెడ్‌లైసెన్స్‌లు పునరుద్దరించుకోవాలని వాణజ్య సంస్థల యజమాన్యాలు, దుకణదారులకు సూచిస్తున్నారు. దీని ఫలితంగా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ట్రెడ్ లైసెన్స్‌ల పునరుద్దరణ ద్వారా ముందుగానే రూ.10 కోట్లు జిహెచ్ఎంసికి వచ్చింది. ఈ సంవత్సరం ట్రెడ్ లైసెన్స్‌ల ద్వారా రూ.100 కోట్లపైగా వసూళ్లను లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

## రాత్రిళ్లు, తెల్లవారుజామున అత్యవసర ప్రయాణాలైతేనే చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కప్పేస్తోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రధానంగా తూర్పు తెలంగాణ జిల్లాల్లో పొగమంచు ఎక్కువగా కురుస్తుందని వాతావరణ శాఖ అధికారి రవీంద్రకుమార్ తెలిపారు. రాత్రి, తెల్లవారుజామున ఎక్కువగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలకు పడిపోయాయని రవీంద్రకుమార్ తెలిపారు. రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలో సాధారణ కనిష్ఠ ఉష్ణోగ్రతలే కొనసాగుతాయని వివరించారు. తూర్పు జిల్లాలైనా భద్రాద్రి, ఖమ్మం, ములుగు జిల్లాలో పొగ మంచు ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పొగ మంచు ఉంటుందని తూర్పు జిల్లాల్లో అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆగ్నేయం నుంచి గాలులు వీస్తున్నందుకు, మరోవైపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉన్నకారణంగా పొగ మంచు కురుస్తుందన్నారు. వచ్చే వారం రోజుల్లో వర్షాలు : రాబోయే నెల రోజుల పాటు రాష్ట్రంలో పొగ మంచు కురుస్తుందని రవీంద్ర కుమార్ తెలిపారు. దట్టమైన పొగమంచు ఉంటున్న కారణంగా అత్యవసర ప్రయాణాలే చేయాలని సూచించారు. కాగా రాబోయే వారం నుంచి పది రోజుల మధ్య వర్షాలు కురిసే అవకాశముందన్నారు.

## సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 26 నుంచి రేషన్ కార్డుల మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసింది. రేషన్ కార్డుల అర్హత ప్రమాణాల పరిశీలనకు ఇప్పటికే మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఇటీవల జరిగిన కుల గణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితా సిద్ధం చేశారు. అర్హుల ఎంపిక కోసం జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన బాధ్యతలుఅప్పగించారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, యుఎల్‌బిలో మున్సిపల్ కమిషనర్‌లకు ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులను ప్రభుత్వం తెలిపింది. ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డులో ప్రదర్శించి, చర్చించిన తర్వాతనే ఆమోదిస్తారు. ఆహార భద్రత కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు చేర్చడంతో, తొలగింపునకు కూడా అవకాశం కల్పించనున్నారు. అర్హత కుటుంబాలకు ఈ నెల 26 నుంచి కొత్త ఆహార భద్రత కార్డులు జారీచేసేందుకు పౌరసరపరఫరాల శాఖ జారీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ సిద్ధమైంది.

## చెత్తను ‘స్వచ్ఛ’ ఆటోల వారికే ఇవ్వాలి




**ప్రజాపక్షం/కాప్రా :** పారిశుధ్య పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంగా జిహెచ్ఎంసి కాప్రా మున్సిపల్ సర్కిల్ సూపర్‌వైజర్ సుదర్శన్ సంక్రాంతి సందర్భంగా హరిదాస్ వేషధారణతో తంబురాను చేతపట్టుకొని మైకు ద్వారా సోమవారం ప్రచారం నిర్వహించారు. విన్నూత రీతిలో కొనసాగించిన ఈ తరహా అవగాహనా కార్యక్రమం పలువురిని ఆకర్షించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ మార్కెట్ లోపల, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తమ ఇళ్లల్లో కానీ వ్యాపారస్థలాల నుండి కానీ ప్రతి రోజు వచ్చే చెత్తను తడి పొడిగా వేర్వేరుగా చేసి తమ వద్దకు ఉదయాన్నే చెత్తను తీసుకొనేందుకు వచ్చే స్వచ్ఛ భారత్ ఆటో కార్మికులకు మాత్రమే ఇవ్వాలే తప్ప ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని ఆయన కోరారు. ప్రతి రోజు బయట పడేసే ప్లాస్టిక్ బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, న్యూస్ పేపర్లు, పాత బట్టలు, పుస్తకాలు లాంటి అనేక వస్తువులను తిరిగి ఉపయోగించేందుకు రీసైకిల్, రీయూస్, రెడ్యూస్ ప్రక్రియను మల్లాపూర్‌లో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేసామని ఆయన తెలిపారు. ఇలాంటి వస్తువులను పౌరులందరూ తమ బాధ్యతగా గుర్తించి జిహెచ్ఎంసి నుండి వచ్చే స్వచ్ఛ ఆటో సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ఆయన కోరారు. సంక్రాంతి పర్వదిన సందర్భంగా సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ హరిదాస్ వేషధారణతోడప్పువాయిద్యాలతో తంబూరాను వాయిస్తూ అవగాహన కల్గిస్తూ ప్రచారం చేయటం పలువురిని విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, కుషాయిగూడ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్లు, బోర్ల మరమ్మతులకు వినతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రాబోయే కాలంలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా మంచి నీటి పైపు లైన్లు, బోర్ల మరమ్మత్తు పనులు చేపట్టాలంటూ మల్కాజిగిరి డివిజన్‌లోని విమలానగర్ కాలనీలో ప్రజలు కోరుతున్నారు. గత ఏడాది తమ ప్రాంతంలో తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కొన్నామని, దీనికి తోడు బోర్లు సైతం సక్రమంగా పని చేయక పోవటంతో నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని కాలనీవాసులు సత్య, విజయలక్ష్మి, డాక్టర్ వాణి, సుకుమార్, చంద్రకళ, లక్ష్మి, రమణి, మునికుమార్, రాజశేఖర్, తులసి రాం, శ్రీనివాస్, సుభాష్, సత్య, సూర్యనారాయణ,సారధి తదితరులు కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్‌కు మొరపెట్టుకొన్నారు. సమస్యలను ఎమ్మెల్యే రాజశేకరరెడ్డితో చర్చించి పరిష్కరిస్తానని, ఇప్పటికే కాలనీలోని పవర్ బోర్‌ను మరమ్మత్తు చేయించామని తెలిపారు.

## ఐక్యతతోనే మున్నూరు కాపుల పురోగతి



రాష్ట్ర సంఘం మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావ్

**ప్రజాపక్షం / కొడంగల్ :** మున్నూరు కాపులు ఐక్యమత్యంగా కలిసి ఉంటేనే పురోగతి సాధ్యమవుతుందని ఆ సంఘం రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర రావ్, ప్రముఖ కవి ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి అన్నారు. సోమవారం కొడంగల్ పట్టణంలోని కెఎస్‌వి పంక్షన్ హాల్‌లో కొడంగల్, బోంరాస్‌పేట, దుద్యాల్, అల్లీఖాన్‌పల్లి, పర్సాపూర్, ఉడిమేశ్వరం తదితర గ్రామాల మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మెళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లాల ముఖ్యప్రముఖులచే 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపుల శాతం అన్ని కులాల కంటే ఎక్కువగా ఉన్నప్పటికి ఎందుకు వెనుకబడిపోతున్నామో ఒక్కసారి ప్రతి ఒక్కరు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాన్ని శాసించే అధికారం మనకు ఉన్నప్పటికి మనలో మనకే ఐక్యత లేక పోవడం చాలా దురదృష్టకరమన్నారు. ఇప్పటికైన ప్రతి ఒక్కరు స్వచ్చందంగా ముందుకు వచ్చి మనలో మనమే ఒక సైనికుడిల పని చేస్తు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి రంగాలలో రాణించాలని సూచించారు. రాష్ట్ర మహాసభ కాచిగూడ ట్రస్ట్ ఆద్వర్యంలో పేద తరగతి విద్యార్థులకు పుస్తె మెట్టెలు, మెరిట్ స్కాలర్ షిప్‌లు, ఉచిత నోటు పుస్తకాలు పంపిణి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటి సభ్యులు ఆనంద్‌కుమార్, ప్రకాశ్, నాగరాజు, సత్యనారాయణ, ఉమ్మడి పాలమూర్ జిల్లా అధ్యక్షుడు పెద్ది పెంటయ్య, ఉపాధ్యక్షుడు కొరమోని వెంకటయ్య, బుచ్చిరెడ్డి, తాండూర్ మార్కెట్ కమటి చైర్మెన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నీరజబాల్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎంపీపీ కన్నం దాయాకర్‌రెడ్డి, సంఘం తాలుక అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్, ప్రదాన కార్యదర్శి బాకారం మల్లయ్య, కోశాధికారి కానుకుర్తి నర్సిరెడ్డి, రాష్ట్ర కమిటి సభ్యులు కానుకుర్తి రమేష్, మున్నూర్ బిచ్చప్ప, అర్గె ఓంప్రకాశ్, బొంకూరు నరేష్‌కుమార్, గంగపోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అర్గె అనంతప్రసాద్, యువక మండలి గౌరవ అధ్యక్షుడు బాకారం శేఖర్, అధ్యక్షుడు కానుకుర్తి హన్మంతు, తాండ్ర గౌరిశంకర్, బానకారి శ్రీనివాస్, తూము సురేష్‌లతో పాటు సంఘం సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.




## ‘డబుల్ బెడ్‌రూమ్’ ఇళ్ల సమస్యలు పరిష్కరిస్తా



ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం లబ్దిదారులు ఎమ్మెల్యే కెపి వివేక్‌ని కలిసి సమస్యలను విన్నవించారు. ముందుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని లబ్దిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో అధికారులతో సమీక్షలు నిర్వహించి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుంటామని అన్నారు. ముఖ్యంగా డబుల్ ఇళ్ల సముదాయంలో మౌలిక వసతులను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే బహద్దూర్ పల్లి, దొమ్మరపోచంపల్లి, దుందిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో లబ్దిదారులకు మౌలిక వసతులతో పాటు ఆర్టీసీ బస్సు సదుపాయాన్ని కల్పించామని అన్నారు. రానున్న రోజుల్లో అన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో అధికారులతో సమావేశాలను నిర్వహించి లబ్దిదారులకు మెరుగైన వసతులను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాజీ నాయక్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులు పాల్గొన్నారు.

## అవంతి కళాశాల 'అరంభ్-2025' ఉత్సవం




ప్రజాపక్షం/హైదరాబాద్: అవంతి పిజి కళాశాల ఆరంభ్ 2025 ఉత్సవాలు నగరంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో అవంతి గ్రూప్ ఆఫ్ లాస్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు ఎం శ్రీనివాసరావు, హెచ్ఆర్ డైరక్టర్ డాక్టర్ వై జయప్రద, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అప్పారావు, విప్రో సంస్థకు చెందిన పవన్ కుమార్, డైరెక్టర్ పి.ఎస్.నాగరాజు, హెచ్ఎంఏ హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్, కె.చంద్ర శేఖర్‌తో పాటు పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

# మహానగరి

## రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### ఆర్‌టిఐ సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగ అందరికీ ఆనందాన్ని పంచాలని, సంక్రాంతి, కనుమ మధురమైన జ్ఞాపకాలను తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యలు వెలికి తీయడంలో 'ప్రజాపక్షం' పాత్ర కీలకం



ప్రజాపక్షం/యాచారం : ప్రజా సమస్యలను వెలికితీయడంలో 'ప్రజాపక్షం' దిన పత్రిక ముందుండి పనిచేస్తుందని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మస్కు నర్సింహ్మా, బట్టు శ్రీనివాస్ అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామంలో 'ప్రజాపక్షం' దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈసంధర్బంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను నిర్భయంగా వెలికి తెలియజేయడంలో 'ప్రజాపక్షం' దినపత్రిక ముందుండి పనిచేస్తుందన్నారు. ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తుందని అన్నారు. ప్రజాపక్షం దినపత్రికను ప్రజలు అదరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేయడంతో బాటు అమలులో ఉన్న లోపాలను వెలికితీయడంలో ముందుండి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోల్లపల్లి పాండయ్య గౌడ్, దేరంగుల ఐలయ్య, కోట్టం శ్రీహారి, బాదం బుగ్గయ్య, నల్లవెల్లి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడారంగంలో రాణించాలి

### ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి




ప్రజాపక్షం/కొందుర్గు : యువత క్రీడారంగంలో రాణించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని కొందుర్గు ఆలిండియా 18వ వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి ముఖ్యఅథితిగా హాజరై విజేతలకు బహుమతులను అంధజేశారు. పోటీల్లో విజేతగా నిలిచిన హుబ్లీ రైల్వేస్ జట్టుతో పాటు రన్నర్ టీంగా నిలిచిన గ్రీన్ ఆర్మీ జట్టుకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా బహుమతులు అంధజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. క్రీడాకారులు క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా చూడాలని అన్నారు. యువత చెడు వ్యసనాలను అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఆయన వివరించారు. విన్నర్‌గా హుబ్లీ రైల్వేస్ జట్టుకు రూ.50వేలు నగదును రవీందర్ రెడ్డి అందజేశారు. రన్నర్‌గా గ్రీన్ ఆర్మీ జట్టుకు రూ.25వేలు నగదును వాలీబాల్ అసోసియేషన్, మూడవ బహుమతి కర్ణాటక జట్టుకు రూ.15వేల నగదును బి.శంకర్ అందజేశారు. రూరల్ విభాగంలో విన్నర్‌గా షాద్‌నగర్ మజీద్ జట్టుకు రూ.20వేల నగదును బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, రన్నర్‌గా పాపిరెడ్డిగూడ జట్టుకు రూ.10వేల నగదును వాలీబాల్ అసోసియేషన్, మూడవ బహుమతిగా బిన్ని రైస్ మిల్లు షాద్‌నగర్ జట్టుకు రూ.5వేల నగదును కె.శ్రీశైలం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు వైస్ ఎంపిపి రాజేశ్‌పటేల్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, రాజారామేశ్వర్‌రెడ్డి, గోపాల్ నాయక్, రవీందర్ రెడ్డి, మాణయ్య, గోపాల్, దర్గా రాంచంద్రయ్య, బాల్‌రాజ్, నర్సింలు గౌడ్, ప్రవీన్, శేఖర్, నాగేశ్, రాజు, ప్రశాంత్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## సంస్కృతీ, సంప్రదాయాలను రక్షించాల్సిన బాధ్యత అందరిది

### ప్రభుత్వరంగ సంస్థల చెర్మన్ శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: సంస్కృతీ, సంప్రదాయాలను పరి రక్షించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం బోగి పర్వదినం సందర్భంగా పట్టనంలోని క్యాంపు కార్యాలయంలో గాలిపటాలను ఎగురవేసి కొద్ది సేపు చిన్నతనం విషయాలను నేమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గాలి పటాలను ఆకాశంలోకి ఎగురవేసి చిన్నతనంలో స్నేహితులతో కలిసి గడిపిన విషయాలను ఒక్కసారి నేమరు వేసుకున్నారు. సంక్రాంతి సమయంలో పాటించే ప్రతి ఆచారం వెనక ప్రత్యేక నమ్మకం, చరిత్ర ఉందని, ఇది ప్రతి ఒక్కరు పాటించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో సంస్కృతి, సాంప్రదాయాలను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు చోటు చేసుకుంటున్నామని, పురాతన కాలం నుండి వస్తున్న ఆచారాలను కాపాడేందుకు ప్రజలందరు కృషి చేయాలని సూచించారు. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు గాలిపటాలను ఎగురవేసేవారమని గుర్తు చేశారు. ఆరుగాలం కష్టపడి అన్నదానలు పండించిన పంటలను ఇంటికి తీసుకువచ్చిన సమయంలో సంక్రాంతి పండుగ నిర్వహించుకుంటాని తెలిపారు. మకర సంక్రాంతి ఉత్తరాయణ సమయంలో గాలి పటాలు ఎగరవేస్తే మంచి జీవితాన్ని, సంతోషాన్ని ఇచ్చినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు గాలిపటాలను ఎగురవేస్తారనే విషయాన్ని పూర్వికులు చెప్తుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంతోపాటు నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

# హైదరాబాద్ నుంచి.. రెండు లక్షల వాహనాలు

### సంక్రాంతికి సొంత వాహనాల్లో స్వస్థలాలకు పయనం



ప్రజాపక్షం/హైదరాబాద్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి రెండు తెలుగు రాష్ట్రాలని సొంతూర్లకు రెండు లక్షల సొంత వాహనాల్లో ప్రజలు వెళ్ళారు. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో ఉన్న 11 టోల్‌గేట్లలో ఈ మేరకు వాహనాల సంఖ్య నమోదైంది. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగకు ఐదు రోజుల పాటు సెలవులు వచ్చాయి. హైదరాబాద్‌లో నివాసం ఏర్పరచుకున్న తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గ్రామీణ ప్రజలు పండుగ కోసం పెద్దసంఖ్యలో ఊర్లకు వెళ్ళారు. నాలుగు రోజుల నుంచి హైదరాబాద్ దాదాపు మొత్తం ఖాళీ అయింది. అయితే నాలుగు రోజుల పాటు నగరానికి నాలుగు వైపుల ఉన్న అన్ని ప్రాంతాల్లోని హైవేలపై వాహనాల తాకిడి భారీగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్‌విజయవాడ, హైదరాబాద్‌వరంగల్, హైదరాబాద్‌బెంగళూరు జాతీయ రహదారులపై భారీఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరీ ముఖ్యంగా విజయవాడ జాతీయ రహదారిపై కిలో మీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో శనివారం ఒక్కరోజు పంతంగి టోల్ ప్లాజాను ఏకంగా 80 వేల వాహనాలు దాటి వెళ్లాయి. అనంతరం సోమవారం ఉదయం కూడా భారీ ఎత్తున వాహనాలు క్యూ కట్టడంతో మూడు రోజుల్లో ఎన్నడూ లేని విధంగా మొత్తం అన్ని మార్గాల్లో కలిపి 1,78,000 వాహనాలు 11 టోల్ గేట్లను దాటి వెళ్లాయి. ఇవన్ని కార్లు మాత్రమే. అయితే సుమారు 25 వేలకు పైగా బైక్‌లపై సొంతూర్లకు వెళ్లిన వారు కూడా ఉన్నారని అంచనా. కాగా సంక్రాంతి పండుగ చరిత్రలో ఇదే అధికమని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మూడు రోజుల్లో పండుగ సెలవులు ముగియనుండగా.. గురువారం నుంచి వాహనాలు తిరుగు ప్రయాణం కానున్నాయి. దీంతో ఎటువంటి ట్రాఫిక్ జామ్ కాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## తెలంగాణలో టిడిపికి పూర్వవైభవం తెస్తాం

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో తెలుగుదేశంకు పూర్వవైభవం వస్తుందని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో సోమవారం టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గానికి చెందిన ఎం.ఏ.సిద్ధికి తన సహచరులతో కలిసి అరవింద్ కుమార్ గౌడ్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి అరవింద్ కుమార్ గౌడ్ కదువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ టిడిపి హయంలో చంద్రబాబు నాయుడు ఐటి, విజన్ 2020 లాంటి బృహత్తర పథకాలతోనే నేడు హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందిందని అన్నారు. సైబర్ టవర్‌తో ఐటీ, విజన్ 2020తో ఫ్లైఓవర్‌లు, ఇతరాత్ర ప్రాజెక్టులు నిర్మాణం జరిగిందన్నారు. ఇప్పటికీ నగర ప్రజలు టిడిపి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. త్వరలోనే టిడిపికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపడుతామని అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ యువతను ప్రోత్సహిస్తుందన్నారు. వారికే ప్రధాన పదవులు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పీకలలోతు అవినీతిలో కూరుకపోయాయని విమర్శించారు. ఇలాంటి తరుణంలో రాజకీయాలలో యువత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి నిర్మూలన, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడే టిడిపి యువతకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, పి.బాలకృష్ణ, విట్టల్, కట్ట రాములు, వినోద్, ఎస్.ఎం.లయాఖుద్దీన్, ఎస్.కె రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

## గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: భక్తిశ్రద్ధలతో గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని జానంపేట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ గోదాదేవి రంగనాయక స్వామి కల్యాణం వైభవంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలోని శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో ఆలయ ఈఓ టి.శివకుమార్, వెంకటేశ్ గుప్త, పిల్లి యాదయ్య, పోలమోని భరత్, రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, యాదయ్య, శ్రావణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.



## నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: సంక్షేమ పథకాల అమలులో నిష్పక్షపాతంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను కోరారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ ఏడాది సంక్రాంతితో తెలంగాణ నాలుగు కొత్త పథకాలను ప్రజల ముందుకు తీసుకువచ్చామని, ప్రణాళిక బద్దంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామ పంచాతీయల వారిగా ప్రజల మద్యనే లబ్దిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలను వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తరువాతే పథకం వర్తింప చేస్తామని వివరించారు.

**ప్రభుత్వ కళాశాలకు ఇన్వైటర్, ప్రింటర్ బహుకరణ...**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మొబైల్ అడ్డా నిర్వాహకులు భార్గవ్‌కుమార్, నవీన్ కుమార్‌లు షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇన్వైటర్‌తోపాటు ప్రింటర్ బహుకరించారు. సెల్‌పోన్ రంగంలో అగ్రగామిగా ఉన్న భార్గవ్ కుమార్, నవీన్‌కుమార్‌లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేష్, హరినాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, మాజీ ఎంపిపి ఇద్రీస్, బస్వం, క్యాసెన్ శ్రీను, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో కార్పొరేట్లు కీలకం

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: కార్పొరేట్లు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర ధారులుగా ఉన్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట గ్రామంలో పునరుద్ధరించిన పలు ప్రాజెక్టులను అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ డేటా సెంటర్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సెర్జియో లొరెయిరో, ఏషియా పసిఫిక్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాజీ పికె,ఇండియా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ అదిత్య చౌదరి సమక్షంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ప్రారంభించిన వాటిలో పబ్లిక్ పార్కు, వాటర్ ప్యూరిఫయర్ సిస్టమ్, పునర్నిర్మాణం చేసిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు, స్వయం సహాయక సంఘ సమావేశ మందిరం ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు రిసెర్చ్' సహకారంతో అమెజాన్ అభివృద్ధి చేసిందని, అమెజాన్ పని చేస్తున్న ప్రాంతాల్లో సమాజంపై సానుకూల ప్రభావం చూపడం దీని ప్రధాన లక్ష్యం అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమెజాన్ చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులను పునరుద్ధరించడంతో పాటు నెధునురు, మీర్‌ఖాన్ పేట, కందుకూరు మండలాల్లో థింక్ బిగ్ స్పేస్లను అమెజాన్ ప్రారంభించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

## షాద్‌నగర్ గ్రేడ్-1 శాఖ పాలకవర్గం ఏర్పాటు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : షాద్‌నగర్ గ్రేడ్ 1శాఖ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నూతన పాలక వర్గ జాబితాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విడుదల చేశారు. షాద్‌నగర్ గ్రేడ్1 శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొప్పుల మదన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లుగా నక్క బాల్‌రాజ్ యాదవ్, వీరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యాసెట్ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కుమ్మరి చంద్రశేఖర్, సింగపాక అనిల్‌కుమార్, కార్యనిర్వహక కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, సభ్యులుగా పటేల్ రోడ్డు ఫయాజ్, కత్తి చంద్రశేఖర్‌అప్ప, కాట్న రాజేశ్, కృష్ణారెడ్డి, శివరాములు యాదవ్, ఆలోనిపల్లి రాజుగౌడ్, రవి నాయక్, జుట్టు అనిల్‌కుమార్‌లను అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమించారు. వీరి ప్రమాణస్వీకారోత్సవాన్ని ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

# సంక్రాంతి సంబురాల్లో ప్రజానికం నిమగ్నం

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: కుటుంబ సభ్యులందరితో ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. అల్లుళ్ళ, కూతుళ్ల బంధుమిత్రులను పండుగకు ఆహ్వానించుకొని మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ సందడి సోమవారం నుంచి ఎల్‌బి నగర్‌లోని కాలనీల్లో మొదలైంది. ఇళ్ల ముంగిళ్లను రంగువల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సంబురంగా వేడుకలు జరుపుకుంటాన్నారు. ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలతో మూడు రోజుల పాటు వేడుకలను వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం బోగి, మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలను జరుపుకోనున్నారు.



**ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇంట్లో బోగి వేడుకలు ...**ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో తన నివాసంలో సంక్రాంతి బోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోగి వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంఎల్ఏలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎంఎల్ఏలు బాల్క సుమన్, నాయకులు కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

**బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీల్లో....** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో కాలనీ అధ్యక్షులు .ఇ కృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతలు అందజేశారు.

### కార్పొరేటర్ లచ్చిరెడ్డి శుభాకాంక్షలు

ఆఫీసర్స్ కాలనీ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేటర్ కార్యాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆఫీసర్స్ కాలనీ సంక్షేమ సంఘం వాసులు మర్యాద పూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బాలాజీ నాయక్, మహేష్ గుప్తా, పవిత్ర, రఘుపతిరెడ్డి, రాజశేఖర్, మోహన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

